

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 24-10-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :126 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

ఏపీ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల



ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి

సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి

ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు

వొకేషనల్ పరీక్షలకు అవే తేదీలు

ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్స్

జనవరి 27న ఎథిక్స్ పరీక్ష

2 లో

చంద్రబాబుకు ప్రజలంటే భయం

నామినేషన్ల అడ్డగింతపై జగన్ ఆగ్రహం

సుప్రీంకోర్టు ఆదేశాలనూ బేఖాతరు చేస్తున్నారు

19 మున్సిపాలిటీల్లో అక్రమాలు

రీ-నామినేషన్లలోనూ కుట్రలు

చంద్రబాబు శకునిలా మారారు

ప్రజలు నిలదీస్తారనే భయంతోనే అక్రమాలు

ఎస్ఈసీ, గవర్నర్‌కు ఫిర్యాదు

రాష్ట్రంలో జంగిల్ రాజ్ నడుస్తోంది



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం):
స్థానిక సంస్థల ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో నామినేషన్ల సమయంలో జరిగిన ఘటనలపై ఆయన మీడియాతో మాట్లాడారు. నామినేషన్ పత్రాలను చించివేయడం, నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ అభ్యర్థులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నామినేషన్ల సమయంలో వైసీపీ నాయకుల్ని హౌస్ అరెస్టులు చేయడమే కాకుండా.. పోలీస్ స్టేషన్లకు పిలిచి మరీ ముందస్తు అరెస్టులు చేశారని, రాష్ట్రాన్ని రావణకాష్ఠంగా మార్చేలా అష్టకుట్రలు పన్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ఖూనీ చేస్తున్నారని వైయస్సార్సీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల్లో అక్రమాలు, దాడులపై అన్ని ఆధారాలను సేకరించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ)కి, గవర్నర్‌కు సమర్పించామని, అలాగే ఈ అన్యాయాలపై సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించామని ఆయన వెల్లడించారు. తమ వాదనలతో ఏకీభవించిన అత్యున్నత న్యాయస్థానం కూటమి ప్రభుత్వానికి గట్టి మొట్టికాయలు వేసిందని, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణను ఈ నెల 25వ తేదీ వరకు వాయిదా వేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు.

2 లో

హీరా గోల్డ్ బాధితులకు బిగ్ రిలీఫ్!

రూ. 103 కోట్ల ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి

బాధితులకు త్వరలో డబ్బుల పంపిణీ

9 ఆస్తుల రిజిస్ట్రేషన్ పూర్తి

బంజారాహిల్స్ భవనం, ఫ్లాట్లు వేలం

రూ. 5,978 కోట్ల డిపాజిట్ల మోసం

హీరా గోల్డ్ కేసులో కీలక పరిణామం

మిగిలిన ఆస్తులకూ ఈడీ వేలం

2 లో

మళ్లీ కేసీఆరే సీఎం : కేటీఆర్

కాంగ్రెస్ వైఫల్యంతోనే సీజేపీ పోరాటం

కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఫైర్

రేవంత్ హడావుడి మరో ఏడాదే

కేసీఆర్‌కు పేరు వస్తుందని పంపులు ఆపారా?

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

దేశానికి కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి అవసరం



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం):
దేశంలో కాంగ్రెస్ పార్టీ విఫలమవడం వల్లే సీజేపీ పేరుతో యువత పోరాటం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బీజేపీని ఎదుర్కోవడంలో కాంగ్రెస్ విఫలమైందని విమర్శించారు. బీజేపీకి ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌కు స్పష్టమైన ఎజెండా లేదని, ఈ పరిస్థితుల్లోనే గతంలో కేసీఆర్ ప్రతిపాదించిన కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి ఆవశ్యకతను ఇప్పుడు ప్రజలు అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. అంబర్‌పేటలో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హడావిడి మరో ఏడాదే నని ఆ తర్వాత కేసీఆరే సీఎం అవుతారని అన్నారు. దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని, కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలు దేశంలో కీలకం అవుతాయన్నారు.

2 లో

వికసిత భారత్‌కు సంస్కృతే పునాది!

భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం

స్వామి చిన్మయానందతో చివరి భేటీ జ్ఞాపకాలు

హోలోగ్రాఫిక్ టెక్నాలజీతో స్వామీజీ దర్శనం

యువశక్తితో బలమైన భారత్ నిర్మాణం

గురుదేవుల ఆశీస్సులు మరువలేనివి

25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న మోడీ

దేశాభివృద్ధికి ఆధ్యాత్మిక విలువలే పునాది

2 లో

చైనా, పాక్, అఫ్ఘాన్‌లో భూకంపాలు!

నాలుగు దేశాల్లో వరుస భూకంపాలు

టిబెట్‌లో పెరుగుతున్న మృతుల సంఖ్య

హిమాలయ ప్రాంతంలో భూకంపాల కలకలం

పాక్‌లో అత్యధికంగా 4.9 తీవ్రత

టిబెట్‌లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం

భూకంపాలతో వణికిన హిందూకుష్ ప్రాంతం

టిబెట్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

2 లో

జనసమీకరణపై కాంగ్రెస్ ఫోకస్!



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి నిర్వహించతలపెట్టిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' మెగా జాతీయ ర్యాలీపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఈ ర్యాలీని విజయవతం చేసేందుకు ఆయా రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణకు సిద్ధం అయింది.

అంటరానితనంతోనే హిందూమతానికి ముప్పు



కుల వివక్షపై ఖర్గే తీవ్ర ఆగ్రహం

ఉత్తరాఖండ్ ఘటనపై ఖర్గే ఆవేదన

వేదికను కడిగి శుభ్రం చేయడం మానసిక హింస

తాగునీరు, విద్య కూడా దక్కనివ్వరా?

అంబేద్కర్ చూపిన విముక్తి మార్గం

బౌద్ధమత స్వీకరణ వెనుక గొప్ప దార్శనికత

సమానత్వంతోనే దేశానికి శ్రీరామరక్ష

సమన్వయమే సమరాయుధం!



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): నేరాల నియంత్రణకు రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం మరింత పెరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సరిహద్దులు దాటి నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉందన్నారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ (ఎస్ఆర్పీసీసీ) సమావేశాన్ని శుక్రవారం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు సంస్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, పోలీసు సంక్షేమం తదితర అంశాలపై మాట్లాడారు.

మిగతాది 2 లో..

- రాష్ట్రాల మధ్య సమన్వయమే కీలకం
- సరిహద్దు నేరాలపై ఉక్కుపాదం
- పోలీసు వ్యవస్థలో నిరంతర సంస్కరణలు
- నక్సల్ రహిత తెలంగాణే లక్ష్యం
- సైబర్ నేరాల కట్టడికి టెక్నాలజీ
- డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక విభాగాలు
- ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- పోలీసు కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- దక్షిణాది భద్రతకు ఉమ్మడి కార్యాచరణ

ఐరాస వేదికగా పాక్‌కు భారత్ కౌంటర్!



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం):
ఐక్యరాజ్యసమితి (యుఎన్) నివేదికలో.. ప్రముఖ తీవ్రవాది దావూద్ ఇబ్రహీంకు సంబంధించి వాస్తవ దూరమైన అంశాలను చేర్చడంపై భారతదేశం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఐరాస స్పెషల్ రిపోర్టర్ బెన్ సాల్ ఇటీవల సమర్పించిన కౌంటర్ టెర్రరిజం నివేదికలో దావూద్ నేతృత్వంలోని 'డి-కంపెనీ'ని భారత్‌కు చెందిన సంస్థగా పేర్కొనడాన్ని తీవ్రంగా నిరసించింది. ఐరాస సమావేశంలో భారత దౌత్యవేత్త రఘు పూరి మాట్లాడుతూ, స్పెషల్ రిపోర్టర్లు బాధ్యతారాహిత్యంగా వాస్తవాలను పక్కనపెట్టి నివేదికలు ఇవ్వడం ఐక్యరాజ్యసమితి విశ్వసనీయతకే తీవ్ర నష్టం కలిగిస్తుందని స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ మార్పు

నామినేషన్ల గడువు పొడిగింపు

కలెక్టరేట్‌లలోనూ నామినేషన్లు

కడప, రాజంపేటలో ఎన్నికలు

మైదుకూరులో 32 వార్డులు

నవంబర్ 1న పోలింగ్

దాడులతో గడువు పొడిగింపు

ఎంపీటీసీ, జడ్పీటీసీ తేదీ మార్పు



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సవరించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం రాత్రి విడుదల చేసింది. 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు/నగర పంచాయతీలకు నవంబరు 1న పోలింగ్ జరగనుంది. నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం, శనివారం కొనసాగనుంది.

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 24-10-2026

హీరా గోల్డ్ బాధితులకు బిగ్ రిలీఫ్!



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన హీరా గోల్డ్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హీరా గ్రూప్ అధినేత నౌహీరా షేక్‌కు చెందిన జప్తు చేసిన ఆస్తుల వేలం ప్రక్రియను వేగవంతం చేసిన ఈడీ అధికారులు, తాజాగా రూ.103.26 కోట్ల విలువైన 9 ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, ఈ మోసంలో నష్టపోయిన అసలైన బాధితులు, డిపాజిటర్లకు న్యాయం చేసేలా ఈడీ ఈ ఈ-వేలం నిర్వహించింది.

వేలంలో అమ్ముడైన ప్రధాన ఆస్తులు ఇవే..

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెం.12, ఎమ్మెల్యే కాలనీలోని ఒక విలాసవంతమైన ఇండిపెండెంట్ భవనంతో పాటు, షేక్‌పేట్‌లోని 6 లగ్జరీ ఫ్లాట్లు ఈ వేలంలో అమ్ముడైన వాటిలో ఉన్నాయి. ఈ ఆస్తుల ద్వారా సమకూరిన మొత్తం సొమ్మును త్వరలోనే అర్హులైన బాధితులకు దశలవారీగా పంపిణీ చేయనున్నారు.

అసలు కేసు ఏంటంటే..

సంవత్సరానికి 36 శాతానికి పైగా భారీ లాభాలు ఇస్తామంటూ హీరా గ్రూప్ సంస్థలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది నుంచి సుమారు రూ.5,978 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి చేతులెత్తేశాయి. పెట్టిన పెట్టుబడులు సరే సరి, కనీసం అసలు డబ్బు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులో ఇప్పటివరకు రూ. 428 కోట్లకు పైగా విలువైన ఆస్తులను ఈడీ ప్రొవిజనల్ అటాచ్ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితురాలైన నౌహీరా షేక్ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. మోసపోయిన ప్రతి ఒక్క బాధితుడికి న్యాయం జరిగే వరకు మిగిలిన అటాచ్ చేసిన ఆస్తులను కూడా దశలవారీగా వేలం వేయనున్నట్లు ఈడీ స్పష్టం చేసింది.

ఐరాస వేదికగా పాక్‌కు భారత్ కౌంటర్!

మొదటి పేజీ తరువాయి

దావూద్ ఇబ్రహీం 1993 నుంచే భారత్‌లో ఉగ్రదాడుల కేసుల్లో మోస్ట్ వాంటెడ్ నేరస్థుడిగా ఉన్నాడని, అతడు 2003లో ఐరాస ఆంక్షల జాబితాలో చేరడానికంటే ముందే భారత్ నుంచి పారిపోయాడని దౌత్యవేత్త స్పష్టం చేశారు. ఒసామా బిన్ లాడెన్ ఎక్కడైతే దొరికి హతమయ్యాడో, అదే పాకిస్తాన్‌లోనే దావూద్ కూడా ప్రస్తుతం నివాసముంటున్నాడని చురకలు అంటించారు. ఈ కీలక వాస్తవాన్ని నివేదికలో ప్రస్తావించకపోవడం వారి విఫలత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలు మానవ హక్కుల చట్రం వెనుక దాక్కుని తమ దుశ్చర్యలను సమర్థించుకోవడం ఫ్యాషన్‌గా మారిందని భారత్ మండిపడింది. ఉగ్రవాదులకు, తీవ్రవాదాన్ని వ్యాప్తి చేసేవారికి మానవ హక్కులు ఆశ్రయంగా మారకూడదని, ఉగ్రవాదాన్ని ఏ రకంగానూ సమర్థించలేమని తేల్చిచెప్పింది. మానవ హక్కుల వేదికలను రాజకీయ ప్రయోజనాల కోసం లేదా నిర్దిష్ట దేశాలను లక్ష్యంగా చేసుకోవడానికి ఆయుధంగా వాడకూడదని హితవు పలికింది.

ఇదే సమయంలో జమ్మూ కాశ్మీర్, లడఖ్ అంశాలపై పాకిస్తాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ సైనిక పాలకుల సంకుచిత రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎద్దేవా చేసింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లు ఎప్పటికీ భారతదేశంలో విడదీయరాని అంతర్భాగాలని, ఆ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నామని రఘు పూరి పునరుద్ఘాటించారు.

చైనా, పాక్, అఫ్ఘాన్‌లో భూకంపాలు!



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): హిందూకుష్ – హిమాలయ ప్రాంతం వరుస భూకంపాలతో వణికిపోయింది. గురువారం రాత్రి టిబెట్ లో భూకంపం సంభవించగా శుక్రవారం తెల్లవారుజామున చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లలో వరుస భూకంపాలు కలకలం సృష్టించాయి. జాతీయ భూకంప కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం ఈ మూడు దేశాల్లో రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 4.1 నుండి 4.9 వరకు నమోదైంది. అత్యధికంగా పాకిస్థాన్‌లో 4.9 తీవ్రతతో భూకంపం వచ్చింది. చైనాలో ఈ ఉదయం 6:05 గంటలకు 4.4 తీవ్రతతో భూకంపం సంభవించగా పాకిస్థాన్ లో ఈ ఉదయం 4:56 గంటలకు 4.9 తీవ్రతతో అత్యంత బలమైన భూకంపం వచ్చింది. ఆఫ్ఘనిస్థాన్ లో ఈ ఉదయం 5:54 గంటలకు 4.1 తీవ్రతతో భూకంపం నమోదైంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

16కు పెరిగిన టిబెట్ భూకంప మృతుల సంఖ్య:

మరోవైపు గురువారం సాయంత్రం టిబెట్‌లో 7.0 తీవ్రతతో సంభవించిన భూ ప్రకంపనల కారణంగా మృతుల సంఖ్య 16కు పెరిగింది. 54 మందికి పైగా గాయపడినట్లు సమాచారం. భూమికి 10కి.మీటర్ల లోతున.. కౌంటీకి 70 కి.మీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ భూకంపం కారణంగా టిబెట్‌లో ప్రాణ నష్టంతో పాటు భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పలు భవనాలు దెబ్బతిన్నాయి. విద్యుత్, టెలికమ్యూనికేషన్ వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు బయటకు పరుగుతు తీస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

మళ్లీ కేసీఆరే సీఎం : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

మమ్మల్ని తిట్టడమే వాళ్ల పని:

మన వద్ద ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఏంచేస్తున్నారో చూస్తున్నామని తెలంగాణ ప్రయోజనాల కోసం ఒక్క ఎంపీ కూడా పని చేయడంలేదన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన వర్గాలన్నీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయని రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారన్నారు. ఎల్ నినో ఉందని 10 నెలల ముందే నిపుణులు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. మమ్మల్ని తిట్టడమే వాళ్ల పని అని విమర్శించారు. పక్క రాష్ట్రాలు ప్రాజెక్టుల్లో నీటిని నిల్వ చేసుకునేందుకు చర్యలు తీసుకున్నా, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను ప్రారంభిస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వాటిని వినియోగించలేదని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలోనూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని విమర్శించారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేదని, తప్పుడు ప్రచారంతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్, తాగునీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

గ్రాడ్యుయేట్లు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి:

ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని కేటీఆర్ అన్నారు. ఎన్నికలు నిర్వహిస్తే 2017లో మాదిరిగా బీఆర్ఎస్ కార్పొరేషన్లలో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి ప్రచారం వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ధనబలాన్ని నమ్ముకుందని కేటీఆర్ ఆరోపించారు. యూత్ డిక్లరేషన్ పేరుతో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటర్లు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండూ కేసీఆర్‌ను విమర్శించే విషయంలో ఒక్కటవుతున్నాయని ఆరోపించారు. దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయ రాజకీయ ఎజెండా అవసరమని, కాంగ్రెస్ వైఫల్యం నేపథ్యంలో కేసీఆర్ గతంలో చెప్పిన కాంగ్రెస్, బీజేపీయేతర రాజకీయ కూటమి ప్రాధాన్యం పెరుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

వికసిత భారత్‌కు సంస్కృతే పునాది!



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): న్యూఢిల్లీలోని భారత్ మంటపంలో నిర్వహించిన 'చిన్మయ అమృత మహోత్సవ్' గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించి ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవాల విశిష్టతను కొనియాడిన ఆయన, మన దేశం సంస్కృతికి జన్మభూమి అని, మన అస్తిత్వానికి మూలస్తంభమని పునరుద్ఘాటించారు. దేశం స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, వికసిత భారత్ లక్ష్యానికి ఆత్మనూ, వేల సంవత్సరాల మహోన్నతమైన సాంస్కృతిక స్ఫూర్తినీ జోడించడమే తమ ఉద్దేశమని ప్రధాని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా 1993లో వడోదరాలో స్వామి చిన్మయానందతో జరిగిన తన చివరి భేటీ జ్ఞాపకాలను ప్రధాని మోడీ నెమరువేసుకున్నారు. సమ్మేళనంలో ఆధునిక హోలోగ్రాఫిక్ సాంకేతికత ద్వారా స్వామీజీ రూపాన్ని సందర్శించడం, మాట్లాడటం తనకు 33 ఏళ్ల నాటి అనుభవాలను, ఆయన ఆప్యాయతను, ఆశీస్సులను మళ్లీ ప్రత్యక్షం చేసినట్లు ఉందన్నారు. నాటి భేటీలో యువశక్తిని సద్వినియోగం చేస్తూ బలమైన, సమర్థవంతమైన భారతదేశాన్ని నిర్మించడమే ప్రధాన చర్చాంశమని గుర్తుచేశారు. ఆ సమావేశం జరిగిన కొద్ది సంవత్సరాలకే గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవ చేసే అవకాశం ప్రజలు తనకు ప్రసాదించారని, నాటి నుంచి నేటి వరకు గత 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా దేశానికి శక్త్యానుసారం సేవ చేస్తున్నానని ప్రధాని తెలిపారు. ఈ సుదీర్ఘ సేవా ప్రయాణంలో గురుదేవుల ఆశీస్సులు నిరంతరం తనతోనే ఉన్నాయని మోడీ స్పష్టం చేశారు.

చంద్రబాబుకు ప్రజలంటే భయం

మొదటి పేజీ తరువాయి

పోటీ చేసే అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేసే వాతావరణం కల్పించాలని, వారికి తగిన రక్షణ, బందోబస్తు కల్పించడంతో పాటు నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ రికార్డింగ్ చేయాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. అత్యున్నత న్యాయస్థానం ఇన్ని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ చంద్రబాబులోగానీ, ఆయన చేతిలో తోలుబొమ్మలా మారిన డీజీపీ, డీఐజీలు, ఎస్పీలు, కలెక్టర్లలోగానీ ఎలాంటి మార్పు రాలేదని మండిపడ్డారు. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ నామినేషన్లను అడ్డుకుంటున్నారంటే రాష్ట్రంలో వ్యవస్థలు ఎంతగా దిగజారిపోయాయో అర్థమవుతోందని విమర్శించారు. పారదర్శకంగా పాలన అందించామని, ప్రజలకు మంచి చేశామనే నమ్మకమే ఉంటే ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు.

రాష్ట్రంలో 19 మున్సిపాలిటీల్లో వైయస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, దీనిపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎస్ఈసీ కేవలం మైదుకూరు, తిరుపతి (18 వార్డులు), కడప (11 వార్డులు), రాజంపేట (11 వార్డులు) వంటి కొన్ని చోట్ల మాత్రమే రీ-నామినేషన్లకు అవకాశం ఇచ్చిందని ఆరోపించారు. కడపలో 66 వార్డులు, రాజంపేటలో 32 వార్డులు ఉంటే కేవలం 11 వార్డుల్లో మాత్రమే రీ-నామినేషన్ అనడం చంద్రబాబు ఏకపక్షంగా గెలవడానికి వేసిన కుట్ర అని ఆరోపించారు. 23 అర్బన్ లోకల్ బాడీస్‌లో పోటీనే లేకుండా చేయడం లేదా నామమాత్రంగా మార్చేయడం వెనుక స్క్రూటినీ పేరుతో చేసిన అక్రమాలే కారణమని దుయ్యబట్టారు.

మహాభారతంలో శకుని తన పాచికలతో ఏ నంబర్ కావాలంటే ఆ నంబర్ పడేలా గేమ్ సెట్ చేసినట్లే, ప్రస్తుతం ఈ వ్యవస్థలో చంద్రబాబు శకునిలా మారి రూల్స్ సెట్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి విపత్తుల్లోనూ ప్రజలకు మేలు చేసి, 90 శాతం హామీలను నెరవేర్చి ధైర్యంగా ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్‌లు, సూపర్ సెవెన్‌లు అమలు కాక ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, ప్రజలు నిలదీస్తారనే భయంతోనే నామినేషన్ల కేంద్రాల వద్ద రిగ్గింగ్‌లు, దాడులు చేయిస్తూ బీహార్‌ను మించిన 'జంగిల్ రాజ్'ను నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనసమీకరణపై కాంగ్రెస్ ఫోకస్!

న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కి వ్యతిరేకంగా నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి నిర్వహించతలపెట్టిన 'ఓట్ బచావో - దేశ్ బచావో' మెగా జాతీయ ర్యాలీపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. ఈ ర్యాలీని విజయవతం చేసేందుకు ఆయా రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున జనసమీకరణకు సిద్ధం అయింది. ఈ మేరకు ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జీలకు వేణుగోపాల్ పలు సూచనలు చేశారు. పీసీసీ, డీసీసీ, బీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాలు, విభాగాలు, క్షేత్రస్థాయి కార్యకర్తలను సమన్వయం చేసుకుని సాధ్యమైనంత ఎక్కువ మందిని ర్యాలీకి తరలించాలని ఆదేశించారు.

జిల్లా, బ్లాక్ స్థాయిలో జన సమీకరణ: జనసమీకరణ కోసం జిల్లా, బ్లాక్ స్థాయిలో ముందుగానే ప్రణాళిక రూపొందించాలని, జన సమీకరణ లక్ష్యాలను నిర్దేశించడంతో పాటు బాధ్యతలు అప్పగించిన నాయకుల వివరాలను అక్టోబర్ 26లోగా ఏఐసీసీకి పంపించాలని లేఖలో పేర్కొన్నారు. ర్యాలీకి వచ్చే నాయకులు, కార్యకర్తల కోసం రైళ్లు, బస్సులు, ఇతర ప్రయాణ టికెట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని ఏఐసీసీ సూచించింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రయాణ ఏర్పాట్లలో ఆలస్యం చేయవద్దని స్పష్టం చేసింది. ఢిల్లీలో పాల్గొనే ప్రతినిధులందరికీ వసతి సౌకర్యాలను కూడా ముందుగానే ఏర్పాటు చేయాలని ఆదేశించింది.

తక్షణమే ఆదేశాలు అమలు చేయాలని సూచన: ఢిల్లీకి సంబంధించిన ఏర్పాట్ల కోసం ఆయా రాష్ట్రాల పీసీసీలు తమ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఏఐసీసీ నేషనల్ వార్ రూమ్, కనెక్ట్ సెంటర్లు రాష్ట్రాల వారీగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తాయని తెలిపింది. ఈ కార్యక్రమాన్ని అత్యంత అత్యవసర అంశంగా పరిగణించి, ఆదేశాలను వెంటనే అమలు చేయాలని వేణుగోపాల్ పార్టీ నేతలకు సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులను సమీకరించి ర్యాలీని విజయవంతం చేయడంపై పార్టీ నాయకత్వం దృష్టి సారించింది.

ఏపీ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఫిబ్రవరి/మార్చి - 2027 వార్షిక పరీక్షల టైమ్‌టేబుల్‌ను ప్రకటించింది. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఫిబ్రవరి 24, 26 తేదీల్లో.. మార్చి 1, 3, 5, 9, 12, 15 తేదీల్లో పరీక్షలు జరుగుతాయి. ఫిబ్రవరి 24న మొదటి రోజు లాంగ్వేజ్ పేపర్-1తో పరీక్షలు ప్రారంభమవుతాయి. మార్చి 15న మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పేపర్-1తో ఫస్టియర్ పరీక్షలు ముగుస్తాయి.

సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమై మార్చి 16 వరకు కొనసాగుతాయి. ఫిబ్రవరి 25న లాంగ్వేజ్ పేపర్-2తో పరీక్షలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 27, మార్చి 2, 4, 8, 11, 13 తేదీల్లో పరీక్షలు నిర్వహించి.. మార్చి 16న మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పేపర్-2తో ముగుస్తాయి. ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సుల విద్యార్థులకు కూడా ఇదే పరీక్ష తేదీలు వర్తిస్తాయని బోర్డు వెల్లడించింది. అయితే వొకేషనల్ పరీక్షలకు సంబంధించిన ప్రత్యేక టైమ్‌టేబుల్‌ను తరువాత విడిగా విడుదల చేయనున్నారు.

ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ కోర్సులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు, వొకేషనల్ కోర్సులకు ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయి. ఇందులో ఆదివారాలు కూడా ఉన్నాయి. అలాగే ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జనవరి 27న, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష జనవరి 29న నిర్వహించనున్నారు. ప్రస్తుతం ప్రకటించిన షెడ్యూల్ తాత్కాలికమైనదని. ప్రభుత్వ సెలవుల ఆధారంగా కొన్ని తేదీల్లో స్వల్ప మార్పులు ఉండొచ్చని బోర్డు స్పష్టం చేసింది.

అంటరానితనంతోనే హిందూమతానికి ముప్పు



న్యూస్ డెస్క్, 23 అక్టోబర్ (ఇది కద నిజం): దసరా పండుగ సందర్భంగా సిద్ధార్థ విహార ట్రస్ట్ నిర్వహించిన 70వ ధమ్మ చక్ర ప్రవర్తన దినోత్సవంలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. హిందూ మతంలో వేళ్లూనుకున్న కుల వివక్ష, అస్పృశ్యత, అన్యాయాల వల్లే ఆ మతం రోజురోజుకూ తన ఉనికిని కోల్పోతూ అంతరించిపోయే దారిలో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో నేటికీ కులతత్వం ఏమాత్రం తగ్గలేదనడానికి తన సొంత అనుభవమే నిదర్శనమని చెబుతూ, ఉత్తరాఖండ్‌లో తాను ప్రసంగించిన వేదికను రెండు రోజుల తర్వాత కడిగి శుభ్రం చేయడం తీవ్రమైన మూఢనమ్మకమని, అదొక రకమైన మానసిక హింస అని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. మార్టిన్, మహమ్మద్ వంటి వారిని ఆహ్వానించే సమాజం.. నా ప్రజలను ఎందుకు దూరం పెడుతోంది? మాకు కనీసం తాగునీరు, చదువు కూడా దక్కనివ్వరా? మేము మనుషులం కాదా? అంటూ నిలదీశారు. మతం పేరుతో వేలాది మంది ప్రజలను బానిసత్వంలో ఉంచిన వాతావరణం నుంచే డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విముక్తి మార్గాన్ని చూపించారని ఖర్గే గుర్తుచేశారు. హిందువుగా పుట్టినప్పటికీ హిందువుగా మరణించనని 1935లోనే ప్రకటించిన అంబేద్కర్, ఆ తర్వాత బౌద్ధ మతాన్ని స్వీకరించడం వెనుక అత్యంత ప్రాధాన్యమైన దార్శనికత ఉందని వ్యాఖ్యానించారు. మూఢనమ్మకాలను, వివక్షను వీడి సమానత్వ మార్గంలో నడవడమే దేశానికి శ్రీరామరక్ష అని ఆయన పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ మార్పు

మొదటి పేజీ తరువాయి



ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించవచ్చు. నామినేషన్ల దాఖలుకు గతంలో నిర్ణయించిన కేంద్రాలతో పాటు కలెక్టరేట్ ప్రాంగణాల్లో కూడా అవకాశం కల్పించారు. దీంతో అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత కేంద్రాల్లో సమర్పించవచ్చు.

కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో 11 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వార్డు నంబర్లు 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55లో ఎన్నికల ప్రక్రియ నిర్వహించనున్నారు. రాజంపేట మున్సిపాలిటీలో 11 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వార్డు నంబర్లు 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27లో అభ్యర్థులు పోటీ చేయనున్నారు. మైదుకూరు మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 18 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వార్డు నంబర్లు 1, 2, 3, 4, 5, 6, 9, 11, 12, 13, 14, 19, 55, 56, 57, 59, 65, 66లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నవంబర్ 1న నిర్వహించేందుకు నిర్ణయించారు. ఎన్నికల అనంతరం నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం, శనివారం కొనసాగనుండటంతో అభ్యర్థులు తమ పత్రాలను నిర్ణీత సమయాల్లో దాఖలు చేయాల్సి ఉంటుంది. 25న ఉదయం నామినేషన్ల పరిశీలన, అదేరోజు ఉపసంహరణకు గడువు ఉంది. పోటీకి సిద్ధపడిన అభ్యర్థుల్ని బెదిరించడం, దాడి చేయడం, నామినేషన్ పత్రాలు చించివేయడం ఘటనల నేపథ్యంలో పోటీచేసే అవకాశాన్ని అభ్యర్థులకు కల్పించేందుకు నామినేషన్ల గడువును పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తేదీలో మార్పు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. వచ్చే నెల 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను 5వ తేదీకి మార్చొచ్చని సమాచారం. అయితే ఎన్నికల తేదీ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనుంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లకు నేటి సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉండగా.. నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల స్వీకరణశుక్రవారం, శనివారం కొనసాగనుంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు నవంబర్ 1న, ఓట్ల లెక్కింపు నవంబర్ 3న జరగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తేదీ మార్పుపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

సమన్వయమే సమరాయుధం!

మొదటి పేజీ తరువాయి

పోలీసు వ్యవస్థలో నిరంతర సంస్కరణలు అవసరం



సమాజానికి భద్రత, రక్షణ అనేవి పునాదులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమర్థవంతంగా, నైతిక విలువలతో, నిష్పక్షపాతంగా పనిచేసే పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటారని చెప్పారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో మార్పులు రావాలని, సంస్కరణలు నిరంతరం కొనసాగాలని అభిప్రాయపడ్డారు. పోలీసు వ్యవస్థకు కేటాయించే వనరులను ఖర్చుగా కాకుండా, మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు చేసే పెట్టుబడిగా భావిస్తున్నానన్నారు. రాష్ట్రాల పోలీసు విభాగాలు, ప్రత్యేక విభాగాల మధ్య సమన్వయం పెంపొందించేందుకు ఎస్ఆర్పీసీసీ సమావేశం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా హైదరాబాద్ పోలీసు వ్యవస్థను మూడు కమిషనరేట్లుగా (హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి) విభజించామని అలాగే సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల కట్టడి, రక్షణ కోసం హైడ్రా, ఈగల్, టీ-సేఫ్ వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రాన్ని నక్సల్ ఫ్రీ తెలంగాణగా మార్చాం:

తెలంగాణను పూర్తిగా నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చడంలో కృషి చేసిన మన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని ఈసందర్భంగా గుర్తు చేశారు. ప్రధాని నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలు ప్రస్తుతం ప్రధాన సవాళ్లుగా మారాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రతి పోలీసు విభాగం సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ పోలీసు శాఖ చేపట్టిన సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అస

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 24-10-2026

యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



ఇది కద నిజం :యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పట్టభద్రులను కలిసి అభ్యర్థికి మద్దతు కోరాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేస్తూ ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

మైలార్‌గూడెం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం మైలార్ గూడెం గ్రామంలో PACS ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ధాన్యం విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కాటేపల్లిలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

ఇది కద నిజం,మోటకొండూరు:

యాదాద్రి భువనగిరి జిల్లా, మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలోని శ్రీ గాయత్రి పత్తి మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా ప్రారంభించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పత్తి రైతులకు కొనుగోళ్ల సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు మరియు మిల్లు నిర్వాహకులు అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన సౌకర్యాలను కల్పించి, విక్రయ ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. రైతులు తాము పండించిన పత్తిని దళారులను నమ్మి మోసపోకుండా, నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి నిబంధనల ప్రకారం విక్రయించి మద్దతు ధర పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో శ్రీ ఆండాళ్ అమ్మవారికి ఘనంగా ఊంజల్ సేవోత్సవం



ఇది కద నిజం, యాదగిరిగుట్ట:

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు ఈ విశేష పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళ శ్రీ ఆండాళ్ అమ్మవారిని రంగురంగుల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ సమయంలో మహిళా భక్తులు అమ్మవారికి మంగళహారతులు పడుతూ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని ప్రధాన ఆలయంలోని అద్దాల మండపంలో వేంచేపు చేసి, మంత్రోచ్ఛారణల నడుమ ఊంజల్ (ఉయ్యాల) సేవోత్సవాన్ని శోభాయమానంగా జరిపారు. ఈ వేడుకను దర్శించుకున్న భక్తులు అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని తిలకించి పులకించిపోయారు.

నేరాల నియంత్రణకు సీసీటీవీలు కీలకం

యాదగిరిగుట్ట ఎస్.ఐ. యాదయ్య



ఇది కద నిజం,యాదగిరిగుట్ట:

యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట లోని సుభాష్ నగర్ కాలనీలో సీసీటీవీ కెమెరాల మరమ్మత్తు మరియు కొత్తగా ఏర్పాటు చేసుకోవడం పై అవగాహన సదస్సు నిర్వహించారు. యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. యాదయ్య, పోలీస్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నేటి కాలంలో ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు మరియు ప్రజా ప్రదేశాల భద్రతకు సీసీటీవీ కెమెరాలు అత్యంత ముఖ్యమైన సాధనంగా మారాయని తెలిపారు. సరైన ప్రదేశంలో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడమే కాకుండా, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సరైన ఆధారాలను సేకరించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. అలాగే ఇళ్లు మరియు వ్యాపార సంస్థలకు అవసరమైన HD/IP కెమెరాల ఇన్‌స్టాలేషన్, కాన్ఫిగరేషన్, వైరింగ్ సెటప్ తో పాటు మొబైల్ ఫోన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చూసుకునే సదుపాయాల గురించి అవగాహన కల్పించారు. దీనితో పాటు పనిచేయని కెమెరాల మరమ్మత్తు, లోపాల పరిష్కారం, హార్డ్‌డిస్క్ మార్పు, వైరింగ్ సమస్యలు మరియు చిత్ర నాణ్యత లోపాలను సరిదిద్దడం వంటి సేవలపై కాలనీ వాసులకు వివరించారు. నిరంతర పర్యవేక్షణ కోసం వార్షిక నిర్వహణ సేవలను కూడా ఉపయోగించుకోవాలని సూచించారు. సీసీటీవీ కెమెరాల వల్ల 24 గంటల పాటు నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతుందని, తద్వారా కుటుంబం, ఆస్తులు మరియు వ్యాపారాలకు పూర్తి భద్రత పెరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు. అంతేకాకుండా ఉద్యోగులు, సందర్శకుల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనించడం సులువవుతుందని తెలిపారు. ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణం కోసం కాలనీ వాసులందరూ తమ పరిసరాలలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మరియు ఇప్పటికే ఉన్న వాటిని క్రమం తప్పకుండా నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ చికిత్సలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపీ చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. సారిక, ఎంఈఓ దేవి సింగ్, ఎస్ఏ సంతోష్ రెడ్డి, ఐఈఆర్‌పీ ఎం. కమల్ కిషోర్ పాల్గొన్నారు. చిన్నారులకు అవసరమైన చికిత్సలు అందించగా, తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. చిన్నారుల శారీరక అభివృద్ధికి ఫిజియోథెరపీ ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా వివరించారు.

విద్యార్థిని వైష్ణవికి రూ.1.20 లక్షల ఆర్థిక సాయం



ఇది కద నిజం, ఉమ్మడి జిల్లా:కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో నీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థిని వైష్ణవికి వసతి గృహ ఫీజు నిమిత్తం రూ.1,20,000 చెక్కును అందజేశారు. విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ఈ సాయం అందించినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రమోద్, జోన్ చైర్మన్ నారాయణ, కార్యదర్శి మారుతి రెడ్డి, సభ్యులు సంజీవ్ రెడ్డి, వేణుగోపాల్, రజిని, లక్ష్మీనారాయణ, రాజు సేట్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ లోని మూడు కార్పొరేషన్లలో టీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

- ఫేక్ గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్ ను అడ్డుకుంటాం
- అడవిలో తామే పులులమని అందరూ చెప్పుకుంటారు
- మానవత్వంతో కూడిన మార్పు హైదరాబాద్ లో రాలే
- కనీసం తాగునీళ్లు ఇవ్వలేనోళ్లం విశ్వనగరం అని ప్రచారం చేసుకుంటున్నాం



ఇది కద నిజం,హైదరాబాద్ : ఫేక్ అగ్రిమెంట్లు, ఫేక్ పెట్టుబడులతో నిర్వహిస్తున్న ఫేక్ గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ అడ్డుకుంటామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గతేడాది తెచ్చామని చెప్పుకుంటున్న ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన శ్వేతప్రతాన్ని విడుదల చేయాలని లేదంటే డిసెంబర్ లో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ సమ్మిట్ అడ్డుకోని తీరుతామని శుక్రవారం మియాపూర్ లో జరిగిన టీఆర్ఎస్ రాజధాని రణభేరి సభలో హెచ్చరించారు. హైదరాబాద్ అభివృద్ధికి పెట్టుబడులు కావాలని తాము కోరుకుంటున్నామని కానీ అబద్దాలు, నకిలీ పెట్టుబడులతో మోసం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మరికొన్ని రోజుల్లో బల్దియా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, క్యాడర్ తో రాజధాని రణభేరి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బల్దియా ఎన్నికలకు సంబంధించి కేడర్ కు దిశానిర్దేశం చేశారు. అనంతరం సభలో మాట్లాడుతూ గ్రేటర్ లోని మూడు కార్పొరేషన్లలో టీఆర్ఎస్ జెండా ఎగరటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలో పోటీ చేస్తామని ఆమె చెప్పారు. కనీసం తాగటానికి కూడా మంచి నీళ్లు ఇవ్వనోళ్లు విశ్వనగరమంటూ ప్రచారం చేసుకుంటున్నారని..వీళ్లా హైదరాబాద్ ను న్యూయార్క్, లండన్ చేసేదంటూ ఎద్దేవా చేశారు. నగరంలో సరైన రోడ్లు, డ్రైనైజీ వ్యవస్థ, మంచి నీళ్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదని.. దోమలు, కుక్కలు స్వైర విహారం చేస్తుంటే పట్టించుకున్న నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి లైట్లు ఎప్పుడు వెలుగుతాయో ఎవరికీ తెలియదని, సీనియర్ సిటిజన్స్ కు భద్రత, గౌరవం లేని పరిస్థితి ఉందన్నారు. హైదరబాద్ లో చెప్పులను ఏసీ షోరూమ్ లల్లో కూరగాయలు, చేపలను రోడ్లపై పెట్టి అమ్ముతున్నారన్నారు. ప్రజారోగ్యంపై ఈ ప్రభుత్వానికి సోయి లేదని విమర్శించారు. కూరగాయలు, చేపలు అమ్మే వారికి ఏసీ బండ్లను ఇవ్వాలని కోరారు. బస్తీ దవాఖానాల్లో డాక్టర్ల సంఖ్య పెంచాలని, ప్రతి డివిజన్ లో 24 గంటలు నడిచే హాస్పిటల్ ఉండాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. ఫాగింగ్, రోడ్ల నిర్మాణంలో, కుక్కల బెడద నివారణ, చెత్త, డ్రైనేజీ నిర్వహణ ఇలా అన్నింటిలో అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు.

మానవత్వంతో కూడిన మార్పు రాలే

హైదరాబాద్ లో మానవత్వంతో కూడిన మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 10 వేలు జీతం వచ్చే వారైనా లక్ష రూపాయలు జీతం వచ్చే వారైనా సరే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రూపీ వ్యాల్యూ తగ్గటం, ప్రభుత్వాలకు ముందుచూపు లేకపోవటంతో విపరీతంగా ధరలు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రదర్స్ ల్యాండ్ గ్రాబింగ్ కారణంగా హైదరాబాద్ చుట్టు పక్కల పంటలు పండే భూమి కోల్పోతున్నామని చెప్పారు. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి కోసం కాకుండా అవినీతి కోసం వాడుకుంటున్నారన్నారు. ఐటీ ఉద్యోగులు ఏఐ కారణంగా ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వస్తే వారిని ఆదుకునేందుకు ఒక పాలసీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ను ఐటీ నగరంగా నిలబెట్టిన ఐటీ ఉద్యోగులకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. హైదరాబాద్ లో చెత్త సేకరించే 50 వేల మంది ఉద్యోగులపై రేవంత్ రెడ్డి కన్నుపడిందని..వారికి నష్టం చేస్తూ రామ్ కీ సంస్థకు మేలు చేయాలని చూస్తున్నారని చెప్పారు. ఆ 50 వేల మంది కుటుంబాల పరిస్థితి ఏంటనీ ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. వారికి నష్టం జరిగితే చూస్తూ ఊరుకోమని ముఖ్యమంత్రి ఇంటి ముందు చెత్తవేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ లో కొత్తగా ఒక్క ప్రభుత్వ స్కూల్ కూడా కట్టటం లేదని..కార్పొరేట్ స్కూళ్లకు మేలు చేసేందుకే ఇలా చేస్తున్నారని అన్నారు. సముద్రం లేని హైదరాబాద్ ను నిజాంలు పెర్ల్ సిటీ గా అభివృద్ధి చేస్తే ఈ ముఖ్యమంత్రి మాత్రం ప్రజలకు కనీస సౌకర్యాలు అందించటం లేదని ధ్వజమెత్తారు. బిర్యానీ, ఇరానీ ఛాయ్, ముత్యాలకు ప్రసిద్ధి చెందిన నగరాన్ని దోమలకు నిలయంగా, కుక్కకాట్లకు కేంద్రంగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బంధించే వేటగాడు వచ్చాడనే విషయం గుర్తు పెట్టుకోండి

బీఆర్ఎస్ పార్టీ తాము షేర్ అని, కాంగ్రెస్ బబ్బర్ షేర్ అని చెప్పుకుంటున్నాయని కానీ ఆ పులులను బంధించే వేటగాడైన టీఆర్ఎస్ పార్టీ వచ్చిందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కవిత హెచ్చరించారు. ప్రజలకు చేయాల్సింది చాలా ఉందని అందుకోసం ఎంతో క్రమశిక్షణతో పనిచేయాలని పార్టీ కేడర్ కు ఆమె సూచించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనుకునే వాళ్లు ప్రజలకు తమ ద్వారా న్యాయం జరుగుతుందని నమ్మకం కలిగించాలని చెప్పారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ లో అన్ని సౌకర్యాలు అందిస్తామని, ప్రజలకు ఉచిత విద్య, వైద్యం ఇస్తామన్నారు. ప్రజల కోసం పనిచేసే తమతో పెట్టుకోవద్దని ప్రత్యర్థి పార్టీలను హెచ్చరించారు. టీఆర్ఎస్ పార్టీ విధానాలను గల్లీ గల్లీకి వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ కేడర్ కు సూచించారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక యూత్ కు 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలని అప్పుడే రాజకీయాలు మారుతాయని చెప్పారు. పాతబస్తీ లో ఉన్న నాయకులు ముఖ్యమంత్రి గులామ్ గా కాకుండా ప్రజలకు గులామ్ గా ఉండాలన్నారు. పాతబస్తీ ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని కోరారు. ముస్లింలను అన్ని పార్టీలు మోసం చేశాయని వారికి తాము మేలు చేస్తామని చెప్పారు. కొత్తగా వచ్చిన మన పార్టీ ఇతర పార్టీలతో పోల్చితే పది రెట్లు ఎక్కువ కష్టపడాలన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 24-10-2026

సినిమా న్యూస్



సైలెంట్‌గా ఓటీటీలోకి బ్లాక్‌బస్టర్!

మొదటి ఆటకే బోల్తా పడి, ఆ తర్వాత థియేటర్లలో రచ్చ లేపిన సినిమాలు ఇండస్ట్రీలో చాలా అరుదు. రీసెంట్‌గా తమిళంలో వచ్చిన 'డోరోతి' సరిగ్గా ఇలాంటి అద్భుతమే చేసింది. నేషనల్ అవార్డు విన్నర్ కీర్తి సురేష్, కార్తీక్ సుబ్బరాజ్ కాంబోలో వచ్చిన ఈ క్రైమ్ థ్రిల్లర్‌పై మొదటి రోజు అంతా పెదవి విరిచారు. కానీ కథలోని మలుపులు, కీర్తి నటన నెమ్మదిగా జనాలకు ఎక్కడంతో సీన్ మొత్తం రివర్స్ అయింది.

ఆడియన్స్ నుంచి పాజిటివ్ టాక్ మొదలయ్యాక థియేటర్ల దగ్గర జనాలు ఎగబడ్డారు. చూస్తుండగానే కలెక్షన్ల వర్షం కురిపించి బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అలా థియేటర్లలో దుమ్మురేపిన ఈ చిత్రం, ఎలాంటి హడావిడి లేకుండా ఉన్నట్టుండి ఓటీటీలోకి దిగిపోయి అందరికీ సర్ ప్రైజ్ ఇచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్'లో ఈ సినిమా నేటి నుంచే స్ట్రీమింగ్ అవుతోంది. ఒరిజినల్ తమిళంతో పాటు తెలుగు, ఇతర భాషల్లో కూడా అందుబాటులో ఉంది. థియేటర్లలో మిస్సయిన వాళ్లతో పాటు మంచి మిస్టరీ థ్రిల్లర్ చూడాలనుకునే వారికి ఈ వీకెండ్‌కు ఇది పక్కా ఎంటర్‌టైనర్.

ఓటీటీలో నాని విధ్వంసం!



వెండితెరపై ఆశించిన ఫలితం రాకపోయినా, డిజిటల్ వేదికపై మాత్రం న్యాచురల్ స్టార్ నాని తన తిరుగులేని ఆధిపత్యాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. 'దసరా' తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో, ఎస్ఎల్వీ సినిమాస్ భారీ బడ్జెట్‌తో నిర్మించిన చిత్రం 'ది ప్యారడైజ్'. అందాల భామ కయాదు లోహర్ హీరోయిన్‌గా, అనిరుధ్ సంగీతం అందించిన ఈ సినిమాపై రిలీజ్‌కు ముందు ఆకాశమంత అంచనాలు ఏర్పడ్డాయి. అయితే థియేటర్లలో విడుదలయ్యాక ఆ అంచనాలను అందుకోవడంలో ఈ ప్రాజెక్ట్ తడబడింది. బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ మూటగట్టుకున్న ఈ చిత్రం, తాజాగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్' వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఆశ్చర్యకరంగా థియేటర్ రిజల్ట్‌తో సంబంధం లేకుండా డిజిటల్ ఆడియన్స్ ఈ సినిమాను ఎగబడి చూస్తున్నారు. నెట్టింట ఇప్పటికీ నెగెటివ్ రివ్యూలు వినిపిస్తున్నప్పటికీ, వాటన్నింటినీ తుత్తునియలు చేస్తూ నాని తన స్టార్ ఇమేజ్‌తో ఓటీటీలో సంచలనం సృష్టించారు. స్ట్రీమింగ్ స్టార్ట్ అయిన 24 గంటల్లోనే దేశవ్యాప్తంగా రికార్డు స్థాయి వ్యూస్‌ను సొంతం చేసుకున్న 'ది ప్యారడైజ్', ఇండియా వైడ్ టాప్ ట్రెండింగ్ చార్ట్‌లో ఏకంగా నెంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. కథాకథనాలపై ఎలాంటి విమర్శలు వచ్చినా ఓటీటీ మార్కెట్‌లో నాని క్రేజ్ ఇసుమంతైనా తగ్గలేదని ఈ రికార్డు చాటిచెబుతోంది. ప్రారంభంలోనే ఈ స్థాయి దూకుడు ప్రదర్శిస్తున్న ఈ చిత్రం, రానున్న రోజుల్లో మరెన్ని వ్యూయర్‌షిప్ రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.

'ఇడుపు కాయితం' సెకండ్ సింగిల్ రిలీజ్



టాలీవుడ్ కథానాయకుడు ప్రియదర్శి హీరోగా, తెలంగాణ జానపద గాయని నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపు కాయితం'. ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ నిర్మాణంలో సుకుమార్ రైటింగ్స్ - బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ఈ సినిమా తెరకెక్కుతోంది. వంశీరెడ్డి దొండపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి సాంగ్ 'శ్రీలత.. ఈ శ్రీనివాసుడే నీ జత..' పాట ప్రస్తుతం వైరలవుతుండగా తాజాగా సెకండ్ సింగిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ గడప పాటను విడుదల చేయగా.. పెళ్లైన అనంతరం కొత్త కోడలు ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. ఈ పాటకు అభినయ శ్రీనివాస్ సాహిత్యం అందించగా.. తేజు విజయ పాడారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.

ప్రభాస్ బర్త్‌డే స్పెషల్

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు వరుస సినీ సర్‌ప్రైజ్‌లు అందాయి. అక్టోబర్ 23న డార్లింగ్ 47వ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రాల నుంచి ఆసక్తికరమైన అప్‌డేట్స్ వెలువడ్డాయి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' నుంచి ప్రభాస్, వంగా కలిసి ఉన్న క్రేజీ ఫొటో బయటకు రాగా.. 'కల్కి 2' చిత్రబృందం ప్రత్యేక మేకింగ్ వీడియోతో అభిమానులను అలరించింది. మరోవైపు 'సలార్ 2' మేకర్స్ సైతం ప్రభాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ సీక్వెల్‌పై అంచనాలను పెంచారు. ఇక జపాన్‌లోనూ డార్లింగ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరగడం విశేషం.

వంగా స్టైల్‌లో 'స్పిరిట్' సందడి

ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చేతిలో డ్రింక్ బాటిల్‌తో వంగా తనదైన శైలిలో కనిపించగా, పక్కనే ప్రభాస్ నవ్వుతూ పోజులిచ్చారు. 'స్పిరిట్స్ ఆర్ హై' అనే క్యాప్షన్‌తో పంచుకున్న ఈ ఫొటో అభిమానులను ఆకట్టుకుంటోంది. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' సినిమాలతో సంచలనం సృష్టించిన వంగా.. ప్రభాస్‌ను 'స్పిరిట్'లో ఏ స్థాయిలో చూపించబోతున్నారనే ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను తొలుత 2027 మార్చి 5న విడుదల చేయాలని భావించినప్పటికీ, తాజా ప్రకటన ప్రకారం దీపావళి కానుకగా 2027 అక్టోబర్ 29న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.



'కల్కి 2' నుంచి మేకింగ్ వీడియో

ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కల్కి 2' చిత్రబృందం ప్రత్యేక మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఇందులో భైరవ పాత్రపై మరోసారి ఆసక్తి పెంచేలా ట్రీట్ అందించింది. 'కల్కి 2898 ఏడీ'లో భైరవగా ప్రభాస్ చేసిన యాక్షన్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, సీక్వెల్‌లో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందనే చర్చ మొదలైంది. తొలి భాగంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె కీలక పాత్రల్లో నటించి సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దీంతో రెండో భాగంలో కథ ఎలాంటి మలుపులు తిరగనుంది? భవిష్యత్ ప్రపంచాన్ని మరింత భారీ స్థాయిలో ఎలా చూపించనున్నారు? అనే అంశాలపై అభిమానుల్లో అంచనాలు పెరుగుతున్నాయి.



'సలార్ 2'పై మేకర్స్ ఆసక్తికర పోస్ట్

ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'సలార్' చిత్రబృందం సైతం సోషల్ మీడియాలో ప్రత్యేక సందేశాన్ని పంచుకుంది. ప్రభాస్‌ను 'వయలెంట్ మ్యాన్'గా అభివర్ణిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. 'సలార్ 2: శౌర్యంగ పర్వం' కోసం తాము కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నామనే సంకేతాలు ఇవ్వడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన 'సలార్' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో, ప్రభాస్ మరోసారి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే సినిమా విడుదల తేదీ, షూటింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.





జపాన్‌లోనూ డార్లింగ్ మానియా

ప్రభాస్ క్రేజ్ భారత్‌కే పరిమితం కాలేదు. జపాన్‌లోనూ ఆయన పుట్టినరోజు వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జపాన్ అభిమానులు కేకులు, బెలూన్లు, ప్రభాస్ సినిమా పోస్టర్లతో వేడుకలను నిర్వహించారు. 'హ్యాపీ బర్త్‌డే ప్రభాస్-సాన్' అంటూ జపనీస్ భాషలో శుభాకాంక్షలు తెలపడమే కాకుండా, కొందరు అభిమానులు తెలుగులోనూ తమ అభిమాన నటుడికి విషెస్ చెప్పారు. గతంలో ప్రభాస్ జపాన్ పర్యటనకు వెళ్లడం అక్కడి అభిమానుల్లో ఆయనపై ఉన్న అభిమానాన్ని మరింత పెంచింది. ఆయన కొత్త సినిమాలు విడుదలైనప్పుడు థియేటర్లలో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పలువురు అభిమానులు వెల్లడించారు. ఈ వేడుకలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.